సాక్షి కుమురం భీం

గురువారం । 25 । మే । 2023



ఆర్టీసీలో 'కూల్'గా ప్రయాణం

ఎండల తీవ్రతకు ప్రయాణికులు ఏసీ బస్సుల్లో ప్రయాణానికి మక్కువ చూపుతున్నారు. ఆన్‌లైన్‌లో ముందుగానే బుకింగ్ చేసుకుంటున్నారు. 8లో▸



సబ్సిడీ పరికరాలు అందేదెప్పుడో?

కొన్నేళ్లుగా రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీ వ్యవసాయ పరికరాలను పంపిణీ చేయడం లేదు. యంత్రాలు కొనుగోలు చేసేందుకు రైతులు ఇబ్బంది పడుతున్నారు. 9లో▸

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 41.7/29.4

ఆకాశంలో కొంత మేర మేఘాలు ఉంటాయి. మధ్యాహ్నం వేడి, ఉక్కపోత అధికంగా ఉంటుంది. వేడి గాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

సింగరేణి ఆధ్వర్యంలో క్రీడాపోటీలు

రెబ్బెన(ఆసిఫాబాద్): తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకలను పురస్కరించుకుని సింగరేణి ఆధ్వర్యంలో పలు క్రీడాపోటీలు నిర్వహిస్తున్నట్లు బెల్లంపల్లి ఏరియా జీఎం దేవేందర్ తెలిపారు. ఈ నెల 26న మాదారం టౌన్‌షిప్‌లోని కమ్యూనిటీ హాల్‌లో, 27న గోలేటిలోని భీమన్న స్టేడియంలో మహిళలు, చిన్నారులకు పోటీలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. అలాగే 27న హరిత గృహాల కోసం దరఖాస్తులు స్వీకరిస్తామని పేర్కొన్నారు. ఆసక్తి గల ఉద్యోగులు పర్సనల్ డిపార్టుమెంట్ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని సూచించారు. 29న హరిత గృహాల పరిశీలన, 31న మాదారం, జూన్ 1న గోలేటిలోని భీమన్న స్టేడియంలో ముగ్గుల పోటీలు ఉంటాయన్నారు. ఏరియాలోని ఉద్యోగుల కుటుంబ సభ్యులు పోటీలను విజయవంతం చేయాలని జీఎం కోరారు.

డిమాండ్లు నెరవేర్చే వరకూ ఉద్యమం



రాస్తారోకో చేస్తున్న వీవోఏలు

ఆసిఫాబాద్‌అర్బన్: ఐకేపీ వీవోఏల డిమాండ్లు నెరవేర్చే వరకూ సీఐటీయూ ఆధ్వర్యంలో ఉద్యమాన్ని కొనసాగిస్తామని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు అల్లూరి లోకేశ్ స్పష్టం చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌక్ వద్ద రాష్ట్రీయ రహదారిపై సీఐటీయూ ఆధ్వర్యంలో వీవోఏలు రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ 38 రోజులుగా వివిధ రూపాల్లో నిరసనలు తెలిపామన్నారు. ఇప్పటివరకు ప్రభుత్వం స్పందించకపోవడంతో సరికాదని, భవిష్యత్తులో పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

హజ్ యాత్రికులకు వ్యాక్సినేషన్



వ్యాక్సిన్ వేస్తున్న వైద్యసిబ్బంది

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ పట్టణంలోని మైనారిటీ ఫంక్షన్ హాల్‌లో బుధవారం కాగజ్‌నగర్ హజ్ సొసైటీ, వైద్యారోగ్య శాఖల ఆధ్వర్యంలో వ్యాక్సినేషన్ కార్యక్రమం నిర్వహించారు. డెప్యూటీ డీఎంహెచ్‌వో సీతారాం ఆధ్వర్యంలో వైద్యసిబ్బంది జిల్లా నుంచి హజ్ యాత్రకు వెళ్తున్న 48 మందికి టీకాలు వేశారు. కార్యక్రమంలో కేంద్ర హజ్ కమిటీ శిక్షకుడు అల్ హజ్ ఆరిఫ్ అహ్మద్, హజ్ సొసైటీ కార్యదర్శి ముకప్పం అహ్మద్, బల్దియా చైర్మన్ సద్దాం హుస్సేన్, సభ్యులు అహ్మద్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

'అరిగెల'కు ఆహ్వానం



ఆహ్వాన పత్రం అందజేస్తున్న నాయకులు

ఆసిఫాబాద్‌అర్బన్: మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ఎఫ్‌సీఐ ఫంక్షన్ హాల్‌లో జాతీయ యాదవ హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో ఈ నెల 28న నిర్వహించే యాదవ శంఖారావం కార్యక్రమానికి హాజరుకావాలని కుమురంభీం జిల్లా యాదవ సంఘం జిల్లా అధ్యక్షుడు, జెడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్‌రావును ఆ సంఘం ప్రతినిధులు ఆహ్వానించారు. బుధవారం జిల్లా కేంద్రంలోని అరిగెల నివాసంలో ఆహ్వాన పత్రం అందించారు. ఈ సందర్భంగా మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు అంజయ్య మాట్లాడుతూ శంఖారావం కార్యక్రమానికి కుమురంభీం జిల్లాలోని యాదవులు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. యాదవుల ఐక్యత, అభివృద్ధి, రాజకీయ ప్రాధాన్యత, ఒగ్గు పూజారులు, కళాకారుల సమస్యలపై చర్చించనున్నట్లు తెలిపారు. ముఖ్య అతిథులుగా రాష్ట్ర మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్, బడుగుల లింగయ్యయాదవ్‌తోపాటు ప్రముఖులు హాజరవుతారని వెల్లడించారు. సంతోష్‌యాదవ్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

'మోడల్'లో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలి

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్‌లో ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు గురువారం లోగా దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ అబ్దుల్ ఖలీల్ ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

- చింతలమానెపల్లి మండలం గూడెం గ్రామంలో సోమవారం రాత్రి ఆబ్కారీ శాఖ ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలలో 16 కాటన్ల దేశీదారు మద్యం స్వాధీనం చేసుకున్నారు. పూల్ చంద్ జైస్వాల్ అనే వ్యక్తిపై కేసు నమోదు చేశారు.
- చింతలమానెపల్లి మండలం గూడెం చెక్‌పోస్ట్ వద్ద మంగళవారం తనిఖీలు చేస్తుండగా మంచిర్యాల జిల్లా కన్నెపల్లి మండలంలోని దాంపూర్ గ్రామానికి చెందిన తలాండి రవి నకిలీ పత్తి విత్తనాలు, గ్లైఫోసెట్ తీసుకువస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. అతడిపై కేసు నమోదు చేశారు. పై రెండు ఘటనల్లోనూ.. సరిహద్దుల్లో నిర్వహించిన తనిఖీల్లో అక్రమ తరలిస్తున్న నిషేధిత ఉత్పత్తులు పట్టుబడ్డాయి. ప్రభుత్వ ఆదేశాలతో జిల్లా సరిహద్దుపై అధికారులు నిఘా కట్టుదిట్టం చేశారు.

సరిహద్దుపై నిఘా

- పోలీసు, ఆబ్కారీ శాఖల తనిఖీలు
- జిల్లా సరిహద్దుల్లో చెక్‌పోస్ట్‌ల ఏర్పాటు
- అక్రమ రవాణాకు అడ్డుకట్ట



స్వాధీనం చేసుకున్న దేశీదారు మద్యంతో ఎక్సైజ్‌శాఖ అధికారులు

చింతలమానెపల్లి(సిర్పూర్): కుమురం భీం జిల్లా తెలంగాణ, మహారాష్ట్ర రాష్ట్రాలకు సరిహద్దులో ఉంది. జిల్లాకు మహారాష్ట్రకు మధ్యలో ప్రాణహిత నది, దట్టమైన అడవులు ఉన్నాయి. కెరమెరి, వాంకిడి, కాగజ్‌నగర్, సిర్పూర్(టి), కౌటాల, చింతలమానెపల్లి, బెజ్జూర్, దహెగాం మండలాలు మహారాష్ట్ర పల్లెలను ఆనుకుని ఉన్నాయి. వాంకిడి, సిర్పూర్(టి) మండలం హుడ్కిలి, వెంకట్రావుపేట, చింతలమానెపల్లి మండలంలోని గూడెం గ్రామాల నుంచి మహారాష్ట్రకు నేరుగా రహదారి సౌకర్యం ఉంది. కాగజ్‌నగర్ నుంచి సిర్పూర్(టి) మీదుగా మహారాష్ట్రకు రైలు మార్గం కూడా ఉంది. ఆయా మార్గాల నుంచి నిత్యం మహారాష్ట్రకు నిషేధిత ఉత్పత్తుల రవాణా జరుగుతోంది.

అక్రమ రవాణాకు రహదారులు

తెలంగాణ, మహారాష్ట్రలో పలు కారణాలతో వినియోగ వస్తువుల ధరల్లో వ్యత్యాసాలు ఉన్నాయి. కొన్నిరకాల వస్తువులపై ఆయా రాష్ట్రాల్లో నిషేధం సైతం ఉంది. మహారాష్ట్రలోని గడ్చిరోలిలో మద్యంపై సంపూర్ణ నిషేధం ఉండగా, తెలంగాణలో ని షేధం ఉన్న గ్లైఫోసెట్ గడ్డి మందుపై మహారాష్ట్రలో నియంత్రణ మాత్రమే ఉంది. దీనిని అనువుగా చేసుకున్న అక్రమార్కులు పోలీసుల కన్నుగప్పి ఇరు రాష్ట్రాలకు తరలిస్తున్నారు. దేశీదారు మద్యం, తక్కువ ధరలో లభించే కల్తీ మద్యం దళారుల ద్వారా నిత్యం వివిధ మార్గాల్లో జిల్లాకు చేరుతోంది. తెలంగాణలో ప్రభుత్వం పేద ప్రజలకు అందించే రేషన్ బియ్యానికి మహారాష్ట్రలో డిమాండ్ ఉంది. ఇక్కడ తక్కువ ధరకు కొనుగోలు చేసి మహారాష్ట్రలోని చంద్రపూర్, వీరూర్, అహేరి తదితర ప్రాంతాలకు తరలించి అక్రమంగా సొమ్ముచేసుకుంటున్నారు.

చెక్‌పోస్టులు ప్రారంభం

నకిలీ విత్తనాలు, నకిలీ మద్యం, తరలుతున్న రేషన్ బియ్యం కారణంగా ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి పడుతోంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం కఠిన చర్యలకు ఉపక్రమించింది. జిల్లా వ్యాప్తంగా అక్రమార్కుల మూలాలను పెకిలించేందుకు అధికారులు కఠిన చర్యలు ప్రారంభించారు. సరిహద్దు మండలాల నుంచి రవాణా మార్గాలలో చెక్‌పోస్ట్‌లను ఏర్పాటు చేసి, నిఘా కోసం సిబ్బందిని నియమించారు. సిర్పూర్ మండలంలోని వెంకట్రావుపేట, జక్కాపూర్, చింతలమానెపల్లి మండలంలోని గూడెం వద్ద చెక్‌పోస్ట్‌లను ప్రారంభించారు. పోలీసు, ఆబ్కారీ శాఖలను సమన్వయం చేసి దాడులు నిర్వహిస్తున్నారు. మహారాష్ట్ర నుంచి రాకపోకలు సాగించే మార్గాల్లో నిఘా పెంచారు. ఎస్పీ సురేశ్‌కుమార్ ఆధ్వర్యంలో ఫెర్టిలైజర్ దుకాణాల యజమానులు, పోలీసులు ఆయా శాఖల సిబ్బందితో సమావేశమై నిషేధిత ఉత్పత్తుల నిరోధానికి తీసుకునే చర్యలపై అవగాహన కల్పించారు.

కఠిన చర్యలు తప్పవు



అంతర్రాష్ట్ర సరిహద్దులపై పూర్తి నిఘా ఉంచాం. పోలీసు శాఖతో కలిసి సంయుక్తంగా తనిఖీలు చేపడుతున్నాం. అక్రమంగా మద్యం రవాణా చేసినా, కల్తీ మద్యం, దేశీదారు, అనుమతి లేని మద్యం తరలిస్తే కఠిన చర్యలు తప్పవు. ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదు.

– విలాస్, ఆబ్కారీ శాఖ సీఐ, కాగజ్‌నగర్

చెక్‌పోస్టుల ఏర్పాటు



నకిలీ విత్తనాలు, దేశీదారు, కల్తీ మద్యం, నిషేధిత గడ్డి మందులు వినియోగించడం, రవాణా చేయడం నేరం. వీటి రవాణా, విక్రయాల నిరోధానికి చర్యలు తీసుకుంటున్నాం. సరిహద్దుల్లో పోలీసుశాఖ ఆధ్వర్యంలో చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి, తనిఖీలు నిర్వహిస్తున్నాం.

– సాదిక్ పాషా, సీఐ, కౌటాల

కిరాణం పేరుతో 'బెల్టు' దందా

- పల్లెల్లో విచ్చలవిడిగా బెల్టు షాపుల నిర్వహణ
- జిల్లా వ్యాప్తంగా 300లకు పైగా ఉంటాయని అంచనా..
- 24 గంటలు అందుబాటులో మద్యం
- మత్తుకు బానిసలుగా మారుతున్న యువత



ఆసిఫాబాద్: జిల్లాలో కిరాణా దుకాణాల మాటున బెల్టు షాపులు విచ్చలవిడిగా వెలుస్తున్నాయి. పట్టణాలతోపాటు గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతీ వీధిలో 24 గంటలపాటు మద్యం అందుబాటులో ఉంటోంది. ఈ కిరాణా షాపుల్లో సరుకుల తోపాటు గుట్టుగా మద్యం విక్రయాలు జరుపుతున్నారు. జనవాసాల్లో ఏర్పాటు చేస్తున్న ఈ షాపులతో మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రధాన రహదారికి కిలోమీటర్ దూరంలో మద్యం దుకాణాలు ఏర్పాటు చేయాలనే నిబంధన ఉంది. దీంతో జిల్లాలో గ్రామాలకు దూరంగా వైన్స్‌లకు అనుమతులు ఇచ్చారు. అయినా అధికారుల కళ్లు గప్పి ప్రజలకు సమీపంలో వాడవాడలా బెల్టు దుకాణాలు ఏర్పాటు చేశారు. ప్రతిరోజూ అర్ధరాత్రి వరకు వ్యాపారం సాగిస్తున్నారు. జిల్లా కేంద్రం తోపాటు జిల్లా వ్యాప్తంగా ఇదే పరిస్థితి ఉంది.

అందుబాటులో అన్నిరకాల బ్రాండ్లు..

ఈ బెల్టు దుకాణాల్లో అన్నిరకాల బ్రాండ్ల మద్యం అందుబాటులో ఉంటోంది. చీప్‌లిక్కర్ నుంచి టాప్ బ్రాండ్ మద్యం, బీర్లు విక్రయిస్తున్నారు. ఉదయం 5 గంటల నుంచే మొదలవుతున్న అమ్మకాలు అర్ధరాత్రి వరకు కొనసాగుతున్నాయి. అవసరమైతే 24 గంటలు తెరిచే ఉంచుతున్నారు. తెలంగాణ ప్రభుత్వం మద్యం దుకాణాలకు అమ్మకాల టార్గెట్లు విధించడంతో ఎక్సైజ్ అధికారులు చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. గ్రామాల్లో మద్యం దొరుకుతుండటంతో చదువుకునే యువకులతోపాటు వృద్ధుల బానిసలుగా మారుతున్నారు. పల్లెల్లో చాలా మంది మద్యానికి బానిసై జీవితాలు నాశనం చేసుకుంటున్నారు. కొంత మంది మద్యం మత్తులో ఆత్మహత్య చేసుకున్న ఘటనలు సైతం ఉన్నాయి. దీనికితోడు జూదం, అసాంఘిక కార్యక్రమాలు పెరిగిపోతుండటంతో యువత బంగారు భవిత ప్రశ్నార్థకంగా మారుతోంది. బెల్టు షాపుల నిర్వహణపై జిల్లా ఎక్సైజ్ అధికారి జ్యోతికిరణ్‌ను సంప్రదించగా.. జిల్లాలో అనుమతి లేకుండా మద్యం అమ్మకాలను అడ్డుకుంటామన్నారు. బెల్టు షాపుల నిర్వాహకులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

అధిక లాభాలు

మద్యం దుకాణం ఏర్పాటు చేయాలంటే టెండర్‌లో దుకాణం దక్కించుకుని, ఏటా ప్రభుత్వానికి రూ.లక్షల పన్ను చెల్లించాలి. దీనికి భారీగా పెట్టుబడి అవసరముంటుది. బెల్టు షాపుల నిర్వహణకు మాత్రం చాలా తక్కువ పెట్టుబడి అవసరం ఉంటుంది. లాభాలు మాత్రం రూ.లక్షల్లో ఉంటున్నాయి. దీంతో ఈ వ్యాపారం మూడు పువ్వులు.. ఆరు కాయలు అన్న చందంగా విరాజిల్లుతోంది. జిల్లా కేంద్రంలోనే సుమారు 50కి పైగా బెల్టు దుకాణాలు ఉన్నాయి. ఇక జిల్లా వ్యాప్తంగా సుమారు 300కు పైగా ఉంటాయని అంచనా. మండల కేంద్రాలు, గ్రామీణ ప్రాంతాల్లో వీటిని విచ్చలవిడిగా ఏర్పాటు చేశారు. లైసెన్సు లేకుండానే మద్యాన్ని ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు విక్రయిస్తున్నారు. మందుబాబులకు గ్లాసులు, ప్లేట్లు, తినుబండారాలు విక్రయిస్తూ లాభాలు అర్జిస్తున్నారు. మద్యానికి బానిసైన వారు బెల్టు షాపులను ఆశ్రయించి నష్టాల పాలవుతున్నారు. డిగ్రీలు, పీజీలు చదువుకున్న నిరుద్యోగులు సైతం ఉపాధి కోసం బెల్టు దుకాణాలతో కాలం వెల్లదీస్తున్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

- అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్

ఆసిఫాబాద్: జిల్లాలో అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లాలో చేపట్టిన అభివృద్ధి పనులపై బుధవారం ఆయా శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ అభివృద్ధి పనులు నిర్దేశిత లక్ష్యాన్ని సాధించేందుకు అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. జిల్లాకు మంజూరైన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సిబ్బంది క్వార్టర్ల నిర్మాణం పూర్తిచేసి వినియోగంలోకి తేవాలన్నారు. ఉప కేంద్రాల భవనాలు, ప్రహరీ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. పంచాయతీ కార్యాలయాల పనులు, మరమ్మతులు పూర్తి చేయాలని, అంగన్‌వాడీ కేంద్రాలకు అవసరమైన మరమ్మతులు చేయించాలన్నారు. కొలాం ఆవాస ప్రాంతాల్లో మంజూరైన అంగన్‌వాడీ భవన నిర్మాణ పనులు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. మన ఊరు– మన బడి కార్యక్రమంలో మొదటి విడతలో ఎంపికైన పాఠశాలల్లో పనులు త్వరగా పూర్తి చేసి, వచ్చే విద్యాసంవత్సరం ప్రారంభంలోగా సిద్ధం చేయాలని తెలిపారు. సమావేశంలో డీఈవో అశోక్, జిల్లా సంక్షేమ అధికారి సావిత్రి, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖ ఈఈలు, డీఈఈలు, ఎంఈవోలు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల మద్దతు ఉన్న వారికే టికెట్టు

- ఏఐసీసీ సెక్రెటరీ నదీమ్ జావేద్



సమావేశంలో నాయకుల మధ్య వాగ్వాదం

సాక్షి, ఆసిఫాబాద్: 'కాంగ్రెస్‌లో నేను సిఫార్సు చేస్తేనో.. లేక జిల్లా అధ్యక్షుడు చెబితేనో అభ్యర్థులకు అధిష్టానం టిక్కెట్టు ఇచ్చే పరిస్థితి లేదు' అని ఏఐసీసీ సెక్రెటరీ, ఆదిలాబాద్ పార్లమెంటరీ పార్టీ ఇన్‌చార్జి నదీమ్ జావేద్ స్పష్టం చేశారు. ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో బుధవారం కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యవర్గ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి కొక్కిరాల విశ్వప్రసాద్‌రావు అధ్యక్షత వహించారు. నదీమ్ మాట్లాడుతూ.. ఎవరేం మాట్లాడినా, ఏ ఉద్దేశంతో మాట్లాడుతున్నారో మాకు తెలుసన్నారు. అబద్ధాలు చెప్పినంత మాత్రాన నిజాలు దాగవన్నారు. ఇప్పటికే కాంగ్రెస్ పార్టీ రానున్న ఎన్నికల బరిలో దిగే అభ్యర్థుల కోసం సర్వేలు చేయించిందని.. ఇక్కడ ప్రజా మద్దతు ఎవరికి ఎక్కువగా ఉంటే వారికే టిక్కెట్టు దక్కుతుందని పేర్కొన్నారు. జిల్లాలో అందరూ కలిసికట్టుగా పనిచేస్తే ప్రియాంక గాంధీతో ఇక్కడ బహిరంగ సభ ఏర్పాటు చేయిస్తాని చెప్పారు. గురువారం జడ్చర్లలో జరిగే బహిరంగ సభకు హిమాచల్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి ముఖ్యఅతిథిగా హాజరవుతారని తెలిపారు.

భగ్గుమన్న విభేదాలు..

కార్యవర్గ సమావేశంలో పార్టీ నేతల మధ్య ఉన్న విభేదాలు మరోసారి బయటపడ్డాయి. పీసీసీ సభ్యుడు గణేశ్ రాథోడ్, జిల్లా అధ్యక్షుడు కె.విశ్వప్రసాద్‌రావు వర్గీయుల మధ్య వాగ్వివాదం జరిగింది. సమావేశం అనంతరం ఏఐసీసీ సెక్రెటరీ నదీమ్ జావేద్ మండల పార్టీ అధ్యక్షులతో విడివిడిగా సమావేశమయ్యారు. ఈ సమయంలో జిల్లా అధ్యక్షుడు అక్కడే ఉండటంతో కొందరు నేతలు అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో ఇరువర్గాల మధ్య కొద్దిసేపు ఘర్షణ వాతావరణం నెలకొంది. అసలు ఈ సమావేశానికి జిల్లా పార్టీ నుంచి గణేశ్ రాథోడ్‌కు పిలుపు రాలేదని తెలుస్తోంది.

కొనుగోళ్లు పకడ్బందీగా నిర్వహించాలి



వీసీలో పాల్గొన్న కలెక్టర్ హేమంత్ బోర్కడే

ఆసిఫాబాద్: యాసంగి వరి ధాన్యం కొనుగోళ్లు పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. హైదరాబాద్ నుంచి పౌరసరఫరాల శాఖ చైర్మన్ రవీందర్ సింగ్, ఉన్నతాధికారులతో కలిసి బుధవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, సంబంధిత శాఖల అధికారులతో ధాన్యం కొనుగోళ్లపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వమే ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి మద్దతు ధర చెల్లిస్తుందన్నారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే రైస్ మిల్లులకు తరలించాలని ఆదేశించారు. రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా కేంద్రాల్లో తాగునీరు, నీడ, ఇతర సౌకర్యాలు కల్పించాలని, వృద్ధులు, దివ్యాంగ రైతులకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. కొనుగోళ్ల ప్రక్రియ త్వరగా పూర్తి చేయడం అధికారులు దృష్టి సారించాలని సూచించారు. అనంతరం కలెక్టర్ హేమంత్ బోర్కడే మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు సౌకర్యాలు కల్పించినట్లు తెలిపారు. రైతులకు రశీదు అందించి, ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేస్తున్నామని వివరించారు. జిల్లాలో కొనుగోళ్లు సక్రమంగా నిర్వహించేందుకు అన్నిచర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రాజేశం, పౌరసరఫరాల శాఖ అధికారి తారామణి, మేనేజర్ గోపాల్, డీపీఎం రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

చర్చలు సఫలం

కాగజ్‌నగర్‌టౌన్: సిర్పూర్ తాలూకా హమాలీ వర్కర్స్ యూనియన్, సీఐటీయూ కాగజ్‌నగర్ హమాలీ కార్మికుల మధ్య మంగళవారం సాయంత్రం జరిగిన చర్చలు సఫలమైనట్లు మర్చంట్ అసోసియేషన్ సభ్యులు తెలిపారు. ఈ మేరకు చర్చలకు సంబంధించిన వివరాలను బుధవారం వెల్లడించారు. కాగజ్‌నగర్‌లో ప్రతీ రెండేళ్లకు ఒకసారి కాగజ్‌నగర్ మర్చంట్ అసోసియేషన్, హమాలీ కార్మికుల మధ్య అగ్రిమెంటు జరుగుతుందని పేర్కొన్నారు. మే మొదటి వారంలోనే జరగాల్సిన అగ్రిమెంటు కొంత ఆలస్యమైనట్లు తెలిపారు. ఈ చర్చల్లో 16 శాతం అగ్రిమెంటు మళ్లీ రెండు సంవత్సరాల కోసం జరిగిందన్నారు. కార్యక్రమంలో మర్చంట్ అసోసియేషన్ సభ్యులు, హమాలీ సంఘం నాయకులు, సీపీఎం జిల్లా కార్యదర్శి కె.రాజన్న, సీఐటీయూ నాయకులు ఎం.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

డిమాండ్లు అంగీకరిస్తేనే భూములిస్తాం

- బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి ఆంజనేయులు గౌడ్



మాట్లాడుతున్న ఆంజనేయులుగౌడ్

రెబ్బెన(ఆసిఫాబాద్): భూములు, ఇళ్లు కోల్పోతున్న సోనాపూర్ ఆదివాసీల డిమాండ్లకు సింగరేణి సంస్థ అంగీకరిస్తేనే ఓసీపీ కోసం భూములిస్తామని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి కేసరి ఆంజనేయులుగౌడ్ స్పష్టం చేశారు. సోనాపూర్ గ్రామాన్ని బుధవారం సందర్శించి భూనిర్వాసితులతో కలిసి మాట్లాడారు. సింగరేణి అధికారులు కొన్ని భూముల్లో మాత్రమే కొలతలు నిర్వహించి, మిగిలిన వాటిల్లో ఎలాంటి కొలతలు చేపట్టకపోవటంతో గిరిజనులు ఆందోళన చెందుతున్నారన్నారు. ఆదివాసీలు సాగు చేస్తున్న భూముల్లో పూర్తిస్థాయిలో కొలతలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఓసీపీలో భూములు కోల్పోతున్న వారి కుటుంబంలో ఒక్కరికి సింగరేణి ఉద్యోగం, ఐదెకరాల భూమి ఇవ్వడంతోపాటు కోల్పోయే భూములకు ఎకరానికి రూ.20లక్షల చొప్పున పరిహారం చెల్లించాలన్నారు. ఇప్పటికే ఒకసారి సోనాపూర్‌లో భూములు, ఇళ్లు కోల్పోయి తీవ్రంగా నష్టపోయారని పేర్కొన్నారు. వారికి ఎలాంటి భరోసా కల్పించకుండానే మరోసారి గిరిజనులను అక్కడి నుంచి తరలించడానికి యాజమాన్యం ప్రయత్నించడం దుర్మార్గమైన చర్యగా అభివర్ణించారు. బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు రాజేశ్వర్, గ్రామస్తులు ధర్మూ, ఆత్రం జంగు, మధుకర్‌గౌడ్, భుజంగరావు, రత్తుబాయి, భీంబాయి, జంగుబాయి తదితరులు పాల్గొన్నారు.

కల్తీ వస్తువులు అరికట్టేందుకు చర్యలు



కిట్లు అందజేస్తున్న డీఎస్‌వో తారామణి

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా వ్యాప్తంగా కల్తీ వస్తువుల విక్రయాలను అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని జిల్లా పౌరసరఫరాల అధికారి తారామణి అన్నారు. జిల్లా కేంద్రంలోని డీఎస్‌వో కార్యాలయంలో బుధవారం కల్తీ నిర్మూలన కిట్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలోని వారసంతలు, హోల్‌సెల్, రిటైల్ దుకాణాల్లో నిత్యావసర సరుకుల కల్తీని గుర్తించేందుకు ఈ కిట్లు తోడ్పాడుతాయని పేర్కొన్నారు. అనంతరం వినియోగదారుల సంస్థకు ఈ కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డీఎం గోపాల్, ఉమ్మడి జిల్లా వినియోగదారుల సంస్థ అధ్యక్షుడు మోహన్ తదితరులు పాల్గొన్నారు.

వాకింగ్ ట్రాక్‌కు మరమ్మతులు చేయించాలి



జీఎం దేవేందర్‌కు వినతిపత్రం అందిస్తున్న సభ్యులు

రెబ్బెన(ఆసిఫాబాద్): గోలేటి టౌన్‌షిప్‌లోని భీమన్న స్టేడియంలో వాకింగ్ ట్రాక్‌కు మరమ్మతులు చేపట్టాలని వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పత్తెం రాజాబాబు కోరారు. ఈ మేరకు బుధవారం బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్ దేవేందర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. రాజాబాబు మాట్లాడుతూ భీమన్న స్టేడియంలో వాకింగ్ ట్రాక్ సక్రమంగా లేకపోవడంతో ప్రతిరోజూ స్టేడియానికి వచ్చే సింగరేణి కార్మికులు, కార్మిక కుటుంబాలు, యువత ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. అలాగే సమీపంలో డంపింగ్ యార్డు ఉండటంతో అనారోగ్యం బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మైదానంలోని మరుగుదొడ్లకు మరమ్మతులు చేయించి అందుబాటులోకి తీసుకురావాలన్నారు. కొత్త ట్రాక్ ఏర్పాటు చేసి, చుట్టూ లైటింగ్ సౌకర్యం కల్పించాలని కోరారు. స్టేడియంలో ఓపెన్ జిమ్‌ను ఏర్పాటు చేయాలని విన్నవించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్, కార్యదర్శి సమయ్య, కోశాధికారి ఓదెలు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఎట్టకేలకు ఊరట..!

- శాంతియుత నిరవధిక సమ్మె ఫలితం
- సీఎం హామీతో జేపీఎస్‌ల్లో ఆనందం

మంచిర్యాలరూరల్(హాజీపూర్): జూనియర్, అవుట్ సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శుల (జేపీఎస్, ఓపీఎస్)కు ఎట్టకేలకు ఊరట లభించింది. జేపీఎస్‌లను క్రమబద్ధీకరణ చేస్తామని సీఎం కేసీఆర్ సోమవారం నిర్ణయం తీసుకోవడంతో ఆనందం వ్యక్తమవుతోంది. తమను రెగ్యులర్ చేయాలని ఏప్రిల్ 28 నుంచి మే 13 వరకు శాంతియుత నిరవధిక సమ్మెలో భాగంగా వివిధ రూపాల్లో నిరసన చేపట్టారు. చర్చల విషయంలో స్పష్టత రాకపోవడం, విధుల్లో చేరితే సమస్య పరిష్కరిస్తామన్నా కార్యదర్శులు ససేమిరా అన్నారు. దీంతో ప్రభుత్వం కూడా ఇకపై చర్చలు జరిపేది లేదంటూ ఒక దశలో వారిని తొలగించి కొత్తవారిని నియమించాలని నిర్ణయించింది. చివరగా జరిగిన చర్చలు ఆశాజనకంగా ఉండడం, ప్రభుత్వ మద్దతు ఉంటుందన్న మంత్రి, అధికారుల హామీతో జేపీఎస్, ఓపీఎస్‌లు సమ్మె విరమించారు.

కార్యదర్శుల పనితీరుపై కమిటీ

జిల్లాలో రెగ్యులర్ పంచాయతీ కార్యదర్శులు 51 మంది, జూనియర్ పంచాయతీ కార్యదర్శులు 218 మంది, అవుట్ సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులు 41 మంది ఉన్నారు. వీరిలో పది మంది రాజీనామా చేయగా ఒకరు సస్పెండ్ అయ్యారు. ఇక జూనియర్ పంచాయతీ కార్యదర్శుల పనితీరు ప్రామాణికంగా విధివిధానాలను నిర్ణయించేలా కలెక్టర్ ఆధ్వర్యంలో కమిటీ వేయాలని సీఎం కేసీఆర్ సూచించారు. కమిటీలో అదనపు కలెక్టర్, ఎస్పీ, జిల్లా అటవీ అధికారి ఉంటారు. కలెక్టర్ నివేదిక మేరకు రాష్ట్ర కమిటీ జేపీఎస్‌ల రెగ్యులర్ విషయంలో నిర్ణయం తీసుకోనుంది.

మరింత బాధ్యతగా పని చేస్తాం..

ప్రభుత్వం జేపీఎస్‌లను రెగ్యులర్ చేస్తామనే ప్రకటనతో మాపై మరింత బాధ్యతను పెంచింది. ప్రజలకు ప్రభుత్వ పథకాలను చేరువ చేస్తూ గ్రామాల అభివృద్ధికి పాటుపడుతాం. సీఎం కేసీఆర్, పంచాయతీ రాజ్ శాఖ మంత్రి దయాకర్‌రావులకు మా కుటుంబాలు రుణపడి ఉంటాయి. గ్రామాల్లో పారిశుధ్య పనులు, పల్లెప్రగతి, పన్నుల వసూళ్లలో ప్రభుత్వ లక్ష్యాలను సాధించేలా నిరంతరం కష్టపడి పనిచేస్తాం. – సంధ్యారాణి, జేపీఎస్, ఖాజీపల్లి, భీమారం మండలం

గాయపడిన వ్యక్తి మృతి

గుడిహత్నూర్: మండలంలోని తోషం గ్రామానికి చెందిన కొల్లూరి నర్సయ్య (53) కాలనీలో జరిగిన గొడవలో తలకు గాయమై చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. శనివారం రాత్రి 8గంటల ప్రాంతంలో నర్సయ్య తాగిన మైకంలో దావ నారాయణ అనే వ్యక్తితో గొడవ పడ్డాడు. నర్సయ్యను నెట్టి వేయడంతో కిందపడి తలకు తీవ్రగాయమైంది. రిమ్స్‌లో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతిచెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

లారీ రాదు.. ధాన్యం కదలదు



- అదే తిప్పలు, అవే కుప్పలు
- ధాన్యం రైతుల పడిగాపులు
- కమ్ముకుంటున్న మేఘాలు, ఆందోళనలో అన్నదాతలు
- గన్నీ సంచులు, వాహనాల కోసం ఎదురుచూపులు

మంచిర్యాల జిల్లాలో సాగు వివరాలు..

జిల్లాలో సాగు విస్తీర్ణం	94.256 ఎకరాలు
దిగుబడి అంచనా	2.54 లక్షల మెట్రిక్‌టన్నులు
ధాన్యం సేకరణ లక్ష్యం	2.28 లక్షల మెట్రిక్‌టన్నుల
కొనుగోలు కేంద్రాలు	ఏర్పాటు 262
ధాన్యం సేకరిస్తున్నవి	243
మూతపడినవి	18
ఇప్పటి వరకు సేకరించిన ధాన్యం	88,612 మెట్రిక్ టన్నులు

మంచిర్యాలఅగ్రికల్చర్: ధాన్యం రైతులకు ఏటా ఇదే పరిస్థితి.. ధాన్యం దిగుబడి వచ్చే సమయానికి కొనుగోలు కేంద్రాలు, గన్నిసంచులు, టార్పలిన్ కవర్లు, తేమ యంత్రాల కోసం, మిల్లుల వద్ద లారీల లోడుతో పడిగాపులు కాస్తున్నారు. లారీలు రాక కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం నిల్వలు పేరుకుపోతున్నాయి. ఇప్పటికే అకాల వర్షాలతో రైతులు నష్టపోయారు. మళ్లీ రెండు రోజులుగా జిల్లాలో ఆకాశం మేఘావృతం అవుతూ అక్కడక్కడ ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురుస్తూనే ఉన్నాయి. అలస్యం కారణంగా అకాల వర్షాలు కురిస్తే ధాన్యం వర్షార్పణం అవుతుందని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. టార్పలిన్ కవర్లు అందుబాటులో లేక రైతులు ఫ్లెక్సీ బ్యానర్లలలో ధాన్యం పోసుకున్నారు. మరికొందరు రైతులు రోజుకు రూ.30, 40 చొప్పున కిరాయి తెచ్చుకొని ధాన్యం రాశులు నిల్వచేసుకుంటున్నారు.

వానాకాలంలో కురిసిన భారీవర్షాలతో నీటి నిల్వలు పెరగడంతో పెద్ద మొత్తంలో పంట వేసుకున్నారు. 2.28 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేశారు. అందుకు అనుగుణంగా గత నెల 19 నుంచి ఇబ్బడి ముబ్బడిగా కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఐకేపీ, పీఏసీఎస్, డీసీఎంఎస్ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇప్పటి వరకు 11,716 మంది రైతుల నుంచి రూ.173.68 కోట్ల విలువ చేసే 88,612 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు. ఇందులో 73 వేల వరకు మిల్లలకు తరలించినట్లు అధికారులు పేర్కొంటున్నారు. జిల్లాలో 250 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాల్సి ఉండగా ఇప్పటి వరకు 262 ఏర్పాటు చేశారు. ఇందులో 243 కొనుగోలు కేంద్రాలల్లో మాత్రమే ధాన్యం సేకరిస్తున్నారు. ఐకేపి 41, ఎఏఎస్‌సీ 120, డీసీఎంఎస్ 82 కేంద్రాల ద్వారా ధాన్యం సేకరణ చేపడుతున్నారు. జిల్లా వ్యాప్తంగా సుమారుగా 30వేల బస్తాలతో పాటు ధాన్యం రాశులు కుప్పలు తెప్పలుగా కనిపిస్తున్నాయి.

కేంద్రాల ప్రారంభం.. సేకరణలో అలసత్వం

లారీలు వస్తలేవు..



నాలుగు ఎకరాల్లో వరి సాగు చేస్తే 130 బస్తాల వడ్లు వచ్చినయి. సెంటర్‌కు వడ్లు తెచ్చి 20రోజులు అవుతంది. సంచులు లేవు, లారీలు సక్కగ వస్త లేవు, కాంట పెడత లేరు. ఇన్నే రాత్రి పగలు ఎండకు ఎండుతూ వానకు తడుస్తు ఉండడు అవుతుంది. భారీ వర్షం వస్తే వడ్లు చేతికి రాకుండా పోతాయి.
– సప్పిడి సంతోష్, చింతపుడి.కన్నెపెల్లి

వానస్తే వడ్లు నీటి పాలే..



పదిరోజులు అవుతంది వడ్లు సెంటర్‌కు తెచ్చి. లారీలు వస్తలేవు. ఇంక ఎన్ని రోజులు ఎదురుచూసుడో అర్థం అయిత లేదు. ఎండకు వడ్లు మంచిగా ఎండిన తేమ తక్కువగానే ఉంది మబ్బులు పడుతున్నాయి. చిరుచిరు జల్లులు పడుతున్నాయి. భారీ వర్షం వస్తే నష్టపోవుడు అవుతుంది. – బొయిని మల్లేష్, అంకుష్‌పూర్, భీమిని

లారీలతో ఎలాంటి ఇబ్బంది లేదు..

కొనుగోలు కేంద్రాలకు రోజుకు 175 లారీలు పంపిస్తున్నాం. 3 నుంచి 4వేల మెట్రిక్ టన్నుల ధాన్యం మిల్లులకు తరలిస్తున్నాం. జిల్లాలో మొత్తం 54 రైస్ మిల్లలకు 19మంది రైస్ మిల్లులు డిఫాల్ట్‌లో ఉన్నాయి. మరో 18 రారైస్ మిల్లులు కావడంతో తీసుకోవడం లేదు. ఆదిలాబాద్, కరీంనగర్ రైస్ మిల్లలకు తరలిస్తున్నాం. ఇప్పటికే 89వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాం. – ప్రేమ్‌కుమార్, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి

రూ.20చొప్పన 10కవర్లు కిరాయికి తెచ్చిన..

కవర్లు లేక ఊళ్లో తెలిసిన వాళ్ల దగ్గర రూ.20చొప్పున 10కవర్లు కిరాయి తెచ్చిన. ఐదు రోజులకు రూ.1000 దాక అవుతాయి. రెండు రోజులుగా మబ్బులు పడుతున్నాయి. మైచర్ ఎక్కువగా ఉందని ఆరబెట్టుమంటున్నారు. వెంటనే కొంటే మంచుగుండు. రోజుల కొద్ది ఉంటే వర్షం వస్తే తడిసిపోయి నష్టపోవాల్సి వస్తది. – రాజన్న, మందమర్రి

అదృశ్యమైన విద్యార్థి ఆచూకీ లభ్యం

బెల్లంపల్లి: హైదరాబాద్‌లో అదృశ్యమైన బెల్లంపల్లి విద్యార్థి తరుణ్ జవార్ ఆచూకీ లభ్యమైంది. హైదరాబాద్ ఆగాపూరా పాన్ మండి ప్రాంతంలో నివాసం ఉంటున్న అమ్మమ్మ ఇంటి వద్ద ఉండి ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సరం విద్యార్థి తరుణ్‌జవార్ బుధవారం అదృశ్యమైన విషయం తెలిసిందే. కళాశాలకు వెళ్తున్నాని ఇంట్లో చెప్పి బయటకు వెళ్లిన తరుణ్ రైల్వేస్టేషన్‌కు చేరుకుని ఓ రైలెక్కాడు. బుధవారం ఓ వ్యక్తి సెల్‌ఫోన్ తీసుకుని తండ్రి మంగీలాల్ జవార్‌కు తరుణ్ నేరుగా ఫోన్ చేసి ఏడ్చుకుంటూ మాట్లాడి తాను ముంబయి వచ్చినట్లు చెప్పాడు. దీంతో తీవ్రమైన ఉత్కంఠకు తెర పడింది. సెల్‌ఫోన్ ఇచ్చిన వ్యక్తి తరుణ్‌ను నేరుగా స్థానిక పోలీసుస్టేషన్‌కు తీసుకెళ్లి పోలీసులకు అప్పగించాడు. పోలీసులు మంగీలాల్‌కు ఫోన్ చేసి నిర్ధారణ చేసుకుని తమవద్ద ఉంచుకున్నారు. మంగీలాల్ ముంబయిలో ఉన్న బంధువులకు ఫోన్ చేసి సమాచారాన్ని చేరవేశారు. ఠాణాకు వెళ్లిన బంధువులు మంగీలాల్‌ను పోలీసులతో మాట్లాడించి తమ ఇంటికి తీసుకెళ్లారు. ఏ కారణంతో తరుణ్ ముంబయికి వెళ్లాడో తెలియరాలేదు. కాగా కొడుకును తీసుకు రావడానికి మంగీలాల్ జవార్ ముంబయికి వెళ్లాడు. విద్యార్థి అదృశ్యం కథ సుఖాంతం కావడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

సారంగపూర్: మండలంలోని బోరిగాం గ్రామానికి చెందిన నాకిడి గంగన్న బుధవారం జామ్ గ్రామంలోని పెట్రోల్ బంక్ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. మోపెడ్‌లో పెట్రోలు పోయించుకునేందుకు జామ్ గ్రామంలోని పెట్రోల్ బంక్‌కు వెళ్తున్నాడు. ఇదే సమయంలో సోన్ మండల కేంద్రానికి చెందిన సుంకరి నర్సయ్య పల్సార్ బైక్‌పై వేగంగా వచ్చి గంగన్న వాహనాన్ని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో గంగన్న తలకు బలమైన గాయాలు కావడంతో స్థానికులు నిర్మల్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు.

టింబర్ యార్డు కార్మికుల సమస్యలు తీర్చాలి

- హెచ్‌ఎమ్మెస్ రాష్ట్ర అధ్యక్షుడు రియాజ్ అహ్మద్



మాట్లాడుతున్న రియాజ్ అహ్మద్

శ్రీరాంపూర్: టింబర్ యార్డులో పనిచేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించాలని హెచ్‌ఎమ్మెస్ రాష్ట్ర అధ్యక్షుడు రియాజ్‌అహ్మద్ డిమాండ్ చేశారు. వారి సమస్యలపై ఆ యూనియన్ ఆధ్వర్యంలో బుధవారం స్టోర్స్ గేట్ ఎదుట బైఠాయించి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టింబర్ యార్డులో పనిచేస్తున్న కార్మికులు 30ఏళ్లుగా ఎదుగుబొదుగు లేని జీతాలతో నష్టపోతున్నారన్నారు. వారు చేసే పనికి నాలుగు కేటగిరీ వేతనం ఇవ్వాల్సి ఉండగా కేవలం మొదటి కేటగిరీ వేతనం పొందుతున్నారన్నారు. ఎస్ఎల్పీ, ఇంక్రిమెంట్లు, అలవెన్సులు రాక ఆర్థికంగా నష్టపోతున్నారని వివరించారు. దీంతో వారు రిటైర్డ్ అయ్యాక వారికి గ్రాట్యూటీ, పెన్షన్ తక్కువగానే వస్తుందన్నారు. దీనిపై గుర్తింపు సంఘం టీబీజీకేఎస్, ఏఐటీయూసీ నేతలు పట్టించుకోవడం లేదన్నారు. దీంతో టింబర్ యార్డు కార్మికులు తమ యూనియన్‌ను ఆశ్రయిస్తే వారిపై ఈ సంఘాల నేతలు బెదిరింపులకు గురిచేస్తున్నారని వివరించారు. దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. కార్మికుల సమస్యలను పట్టించుకోకుండా ఉచిత మస్టర్లు పడుతూ ఆ సంఘాల నేతలు కంపెనీకి నష్టం చేస్తున్నారన్నారు. దీంతో పాటు స్టోర్స్‌లో ప్రమాదాలు జరిగినప్పుడు ఏ మాత్రం సంబంధం లేని క్లర్కులను బాధ్యులను చేస్తూ వారిపై చర్యలు తీసుకుంటున్నారని దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. మహిళా ఉద్యోగులకు వాష్ రూమ్స్ సరిగ్గా లేవన్నారు. అనంతరం అధికారులను కలిసి వినతి పత్రం అందించారు. ఆ యూనియన్ సింగరేణి విభాగం అధ్యక్షులు జక్కుల నారాయణ, బ్రాంచీ కార్యదర్శి తిప్పారపు సారయ్య, నాయకులు గోల్ల సత్యనారాయణ, డి.శ్రీనివాస్, రేగుంట సందీప్, ఎలుక నారాయణ, అశోక్, రాజ్‌కుమార్, ఐత వెంకటస్వామి, గొర్రె శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆర్టీసీలో 'కూల్'గా ప్రయాణం

- మండుతున్న ఎండలతో ఏసీ బస్సులకు డిమాండ్
- రెండు, మూడు రోజుల ముందుగానే అడ్వాన్స్ బుకింగ్



మంచిర్యాల డిపోలో నిలిపిన ఏసీ బస్సులు

మంచిర్యాలఅర్బన్: రోజురోజుకూ ఎండలు మండిపోతున్నాయి. పగటివేళ ఉష్ణోగ్రతలు పెరిగిపోతున్నాయి. దీంతో ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే వారు ఎయిర్ కండీషన్డ్ (ఏసీ) బస్సుల వైపు ఆసక్తి చూపుతున్నారు. తక్కువ చార్జీలున్నా లగ్జరీ బస్సుల కంటే ఏసీ బస్సులకు ప్రాధాన్యమిస్తూ చార్జీలను లెక్కచేయడం లేదు. హైదరాబాద్‌కు వెళ్లాలనుకునే ప్రయాణికులు ఆన్‌లైన్‌లో రెండు, మూడు రోజుల ముందుగానే అడ్వాన్స్ బుకింగ్ చేసుకుంటున్నారంటే డిమాండ్ ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. సాధారణ రోజుల్లో ఏసీ బస్సుల్లో ప్రయాణించే వారి సంఖ్య తక్కువే. ఎండలు తీవ్రంగా ఉండడంతో ప్రతి ట్రిప్పులో బస్సు ఫుల్ అవుతుందని చెబుతున్నారు డ్రైవర్లు. సమ్మర్ నేపథ్యంలో ఏసీ బస్సులు మరిన్ని పెంచాలనే డిమాండ్ లేకపోలేదు.

ఏడు బస్సులు.. ఎనిమిది ట్రిప్పులు

మంచిర్యాల –హైదరాబాద్‌కు రాజధాని ఏసీ బస్సులు ఏడు ఉండగా ఎనిమిది ట్రిప్పులు వేయాల్సి ఉంది. ఇందులో పూర్తిస్థాయిలో రాకపోకలు సాగించిన బస్సులు లేవని తెలుస్తోంది. మొదట్లో డిపోలో మూడు ఏసీ బస్సులు ఉండేవి. తర్వాత కాలంలో ఇతరత్రా డిపోలకు చెందిన పాత బస్సులు ఇక్కడకు కేటాయించారు. బస్సులో ఏసీ ప్రాబ్లమ్, ఇతరత్రా సమస్యలతో నిత్యం మోరాయిస్తున్నట్లు తెలుస్తోంది. పేరుకు ఏడు బస్సులున్నా ఆరు బస్సులు మాత్రం రాకపోకలు సాగిస్తాయి. వారం కిందట వరకు మూడు బస్సులు మాత్రమే నడిచినట్లు తెలుస్తోంది. బస్సుల్లో విధులు నిర్వహించే అటెండర్లు విధులు మానేశారు. 16మంది చేసే చోట ఎనిమిది మందితోనే విధులు చేయాలనడంతో విధులకు దూరంగా ఉంటూ వచ్చారు. అధికారులు, కాంట్రాక్టర్‌కు మధ్య చర్చలు సఫలం కావడంతో రెండు నెలలుగా డిపోలకే పరిమితమైన బస్సులు నాలుగు రోజులుగా రోడ్డెక్కాయి. ప్రస్తుతం రాకపోకలు సాగిస్తున్న ఏసీ బస్సులకు అంతకంతకు డిమాండ్ పెరిగిపోయింది. పాత బస్సుల స్థానంలో కొత్త బస్సుల ఏర్పాటుతో కూల్‌గా ప్రయాణం సాగించేలా చొరవ చూపాలని ప్రయాణికులు కోరుతున్నారు.

కుంటాలను సందర్శించిన ట్రెయినీ ఎఫ్‌ఎస్‌వోలు

నేరడిగొండ: రాష్ట్రంలోనే ఎత్తైన కుంటాల జలపాతాన్ని 21వ బ్యాచ్‌కు చెందిన 15మంది ట్రెయినీ ఎఫ్‌ఎస్‌వోలు ఏసీడీ టూర్ ఇన్‌చార్జి సునితతో కలిసి బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా వారికి సిరిచెల్మ రేంజ్ అధికారి గణేష్, సెక్షన్ ఆఫీసర్ వసంత్, బీట్ ఆఫీసర్ సచిన్‌లు స్వాగతం పలికారు. సిరిచెల్మ రేంజ్ అధికారి కుంటాల జలపాతం విశిష్టతను వివరించారు. ఈడీసీ కమిటీ, సిరిచెల్మ రేంజ్, తదితర అంశాలపై వివరించారు. కా గా ట్రైనీ ఎఫ్‌ఎస్‌వోలు జలపాతం అందా లను వీక్షించి ఆనందించారు. అటవీ శాఖ అధికారులు పాల్గొన్నారు.

క్యాన్సర్ బాధితుడికి అందుతున్న సాయం

ఖానాపూర్: మండలంలోని గోసంపల్లె గ్రామానికి చెందిన కడమంచి రాజేష్ క్యాన్సర్ వ్యాధితో బాధపడుతుడున్నాడు. నిరుపేద కుటుంబానికి చెందిన రాజేష్‌కు ‚ఆపన్నహస్తం అందించరూ‛ శీర్షికన ఈ నెల 19న సాక్షిలో ప్రచురితమైన కథనానికి దాతలు స్పందిస్తున్నారు. గ్రామానికి చెందిన కొండేరి దినేష్‌తో పాటు పస్తం కిరణ్‌లు పలువురు దాతల నుంచి స్వీకరించిన రూ.15వేల విరాళాన్ని బాధిత కుటుంబానికి బుధవారం అందజేశారు. బాధితుడి కొడుకు, కూతురిని ఏడో తరగతి వరకు ఉచితంగా చదివిస్తానని గ్రామంలోని బ్రిలియంట్ స్కూల్ కరస్పాండెంట్ బాక నాగమొగిలి హామీ ఇచ్చారు. ఇంకా దాతలు స్పందించి ఆదుకోవాలని కుటుంబీకులు కోరుతున్నారు. దాతలు ఫోన్‌పే నంబర్ 8184886605 ద్వారా సాయాన్ని అందించాలని కోరారు.

ఖరీఫ్‌లో సాగు యోగ్యమైన వరి రకాలు

సాగుబడి



బెల్లంపల్లి: ఖరీఫ్ సీజన్‌లో సాగుకు యోగ్యమైన వరి రకాలను వ్యవసాయ శాఖ సిఫారసు చేసింది. వాతావరణ స్థితిగతులు, చీడపీడలు ఇతర ప్రతికూల పరిస్థితులను తట్టుకునే రకాలను సిద్ధం చేశారు. వీటిలో దీర్ఘకాలిక, మధ్యకాలిక, స్వల్ప కాలిక రకాలు ఉన్నాయి. దొడ్డు గింజ, సన్న గింజ రకాలను రైతాంగానికి అందుబాటులో ఉంచారు. రైతులు సాగు చేయడానికి అనుకూల రకాలు, వాటి గుణగణాలను బెల్లంపల్లి కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే) ప్రధాన శాస్త్రవేత్త ఎం.రాజేశ్వర్‌నాయక్ వివరించారు.



రాజేశ్వర్ నాయక్, కేవీకే ప్రధాన శాస్త్రవేత్త ,బెల్లంపల్లి

వరి రకాలు, వేసుకునే సమయం..

దీర్ఘకాలిక

వరంగల్ 44(సిద్ధి), సాంబ మసూరి పంట కాలం 140 రోజులు ఉంటుంది. మే 25 నుంచి జూన్ 25వరకు సాగు చేయవచ్చు.

మధ్యకాలిక

రాజేంద్రనగర్ 2458(కృష్ణ), వరంగల్ 32100(వరంగల్‌సన్నాలు), వరంగల్ 915, జగిత్యాల 384(పొలాసప్రభ) పంట కాలం 135 రోజులు ఉంటుంది. జూన్ 25వరకు సాగు చేయవచ్చు.

స్వల్పకాలిక

కునారం 1638, కునారం 118(కునారం సన్నాలు), జగిత్యాల 18047(బతుకమ్మ), వరంగల్ 962, రాజేంద్రనగర్ 21278, రాజేంద్రనగర్ 15048(తెలంగాణసోన), రాజేంద్రనగర్ 29325, మారుటేరు 1010(కాటన్ దొర సన్నాలు) పంట కాలం 125రోజుల కంటే తక్కువగా ఉంటుంది. జూన్ 25వరకు సాగు చేసుకోవచ్చు.

కొత్తగా విడుదలైన వరి రకాలు, లక్షణాలు

- కంపసాగర్ 2874 పంట కాలం 140 రోజులు ఉంటుంది. సన్న గింజరకం , చౌడు నేలలకు అనుకూలం, దోమపోటునుతట్టు కుంటుంది.
- రాజేంద్రనగర్ 11718 పంట కాలం 140రోజులు ఉంటుంది. సన్నగింజరకం, అగ్గి తెగులు, ఎండాకు తెగులు, సుడి దోమను మధ్యస్తంగా తట్టుకుంటుంది. చౌడు నేలలకు అనువైనది.
- జగిత్యాల 28545 పంట కాలం 135 రోజులు ఉంటుంది. సన్న గింజరకం , బియ్యం నాణ్యత బాగా ఉండి అన్నం రుచి సాంబమసూరి లాగా ఉంటుంది. బ్యాక్టీరియా ఆకు, ఎండుఆకు తెగులు, మెడ విరుపును మధ్యస్తంగా తట్టుకుంటుంది.
- జగిత్యాల 27356 పంట కాలం 135 రోజులు ఉంటుంది. అతి సన్నగింజరకం, అన్నం నాణ్యత చాలా బాగుంటుంది.
- జేజీఎల్24423 పంట కాలం 135 రోజులు ఉంటుంది. దొడ్డురకం. గింజరాలదు. పంటపడిపోదు. సుడి దోమను కొంతవరకు తట్టుకుంటుంది. కొంతవరకు చౌడును తట్టుకుని అధిక దిగుబడిని ఇచ్చే వంగడం. మెడ విరుపును తట్టుకోదు.

అందని వడ్డీ రాయితీ..!

- రెండు నెలలకు పైగా ఎస్‌హెచ్‌జీ సభ్యుల ఎదురుచూపు



సమావేశమైన సంఘ సభ్యులు (పాత చిత్రం)




ఈ ఫొటోలో కనిపిస్తున్న మహిళ పేరు కేతి వజ్రవ్వ. దండేపల్లి మండలం వెలగ్గనూర్ ఇందిరమ్మ మహిళా సంఘం అధ్యక్షురాలు. వీరి సంఘానికి ప్రభుత్వం వడ్డీ రాయితీ కింద రూ.26వేలు ప్రకటించింది. అందుకు సంబంధించిన పత్రాన్ని మహిళా దినోత్సవం రోజున అందించింది. కానీ ఇంతవరకు తమ ఖాతాలో వడ్డీరాయితీ మాత్రం జమకాలేదని వజ్రవ్వ చెబుతోంది.

దండేపల్లి: స్వయం సహాయక సంఘాల సభ్యులకు అన్ని విధాలా చేయూత నందిస్తామని గొప్పలు చెప్పిన ప్రభుత్వం, మహిళ సంఘాలకు బకాయిపడిన వడ్డీరాయితీలను వారివారి ఖాతాల్లో వేస్తామని మార్చి 8న మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రభుత్వం ప్రకటించింది. ప్రకటన చేసి సుమారు రెండు నెలలు దాటినా ఇంతవరకు వడ్డీ రాయితీ వారి ఖాతాల్లో జమ కాక పోవడంతో స్వయం సహాయక సంఘాల సభ్యులు రాయితీ డబ్బులు ఎప్పుడు ఖాతాల్లో జమవుతాయా? అని ఎదురుచూస్తున్నారు. తమ తమ సంఘాలకు వచ్చే వడ్డీ రాయితీ పత్రాలను మహిళా దినోత్సవం రోజున అందించారు. కానీ రాయితీ మాత్రం రాలేదు.

రూ.12.62 కోట్లు మంజూరు..

మహిళలు ఆర్థిక స్వావలంబన దిశగా పయనించేందుకు గ్రామీణ ప్రాంతాల్లో గ్రామీణాభివృద్ధి శాఖ, బ్యాంకు లింకేజి ద్వారా రుణాలు అందిస్తున్నారు. ఎలాంటి వడ్డీలేకుండా రుణాలు ఇవ్వాలనేది ప్రభుత్వ లక్ష్యం. ఇందుకు 2018–19 నుంచి ఇప్పటి వరకు వడ్డీ రాయితీ ఇవ్వలేదు. రుణాలు పొందిన సంఘం సభ్యులే బ్యాంకులో అసలుతో పాటు వడ్డీ చెల్లిస్తున్నారు. ప్రభుత్వం ఎప్పటికైనా తాము చెల్లిస్తున్న వడ్డీని రాయితీ రూపంలో తిరిగి చెల్లిస్తుందనే నమ్మకంతో ఉన్నారు. 2018–19, 2019–20 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన వడ్డీరాయితీలను చెల్లిస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటన చేసింది. దీంతో మంచిర్యాల జిల్లాలోని 8,459 ఎస్‌హెచ్‌జీలకు రూ.12.62 కోట్ల వడ్డీరాయితీలను మంజూరు చేసింది. దీంతో జిల్లాలోని మహిళా సంఘాల సభ్యుల్లో సంతోషం వెల్లివిరిసింది. కానీ రెండు నెలలు దాటిన వడ్డీరాయితీ మాత్రం అందలేదు.

రాయితీ అందించాలి...



మహిళా దినోత్సవం రోజున మహిళ సంఘాలకు రెండేళ్ల వడ్డీ రాయితీ అందిస్తున్నట్లు ప్రకటించింది. అందుకు సంబంధించిన పత్రాలను సంఘాల లీడర్లకు అందించారు. రెండు నెలలు గడుస్తున్నా రా యితీ ఖాతాల్లో జమ చేయకపోవడం బాగోలేదు. కనీసం ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వడ్డీరాయితీని ఖాతాల్లో జమచేయాలి.
- సిరికొండ ఉమా, గ్రామ సంఘం అధ్యక్షురాలు, దండేపల్లి

ఖాతాల్లో జమవుతాయి...

మహిళా సంఘాలకు రావాల్సిన వడ్డీరాయితీని ప్రభుత్వం మహిళ సంఘం బ్యాంకు ఖాతాలో జమ చేస్తుంది. సంఘాలకు రావాల్సిన వడ్డీరాయితీకి సంబంధించి మహిళా దినోత్సవం రోజున పత్రాలు అందించింది. కొద్దిగా ఆలస్యమైన గ్రూపు ఖాతాలో తప్పక జమవుతాయి.
–శేషాద్రి, డీఆర్‌డీవో, మంచిర్యాల